క్లుప్తంగా

సదరం క్యాంప్ పునఃప్రారంభం



తెనాలిఅర్బన్: వికలాంగుల ధృవపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా ఈ క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



తెనాలిరూరల్: మండల పరిధిలోని పెదరావూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఒకే సర్వే నంబరులో వేరువేరుగా ఉన్న భూములకు ఒకే నెంబర్ పై ల్యాండ్ పార్సెల్ మ్యాప్ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. అలాగే హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య హక్కులు స్పష్టంగా పొందుపరచడం జరుగుతుందన్నారు. రైతులు, గ్రామస్తులు రీ సర్వే ప్రక్రియకు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఉన్న జంపని కాల్వలో జరుగుతున్న పూడికతీత పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జంపని డ్రైన్‌లో పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. కాల్వల్లో వ్యర్థాలు వేయటం వల్ల తరచు మురుగు పారుదల నిలచిపోతుందన్నారు. వ్యాపారులు, ప్రజలు చెత్తను కాల్వల్లో వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కూలింగ్ వాటర్ సదుపాయం



తెనాలిఅర్బన్: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వాకర్స్ క్లబ్ తెనాలి-2 అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్‌ను జి మురహరిరావు ప్రారంభించారు. విద్యార్థులు, పాదచారుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేసినట్లు దాత ఉమామహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో రావి సుబ్బారావు, సత్యనారాయణ రాజు, ఆర్.శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టసవరణను కేంద్రం ఉపసంహరించుకోవాలి



తెనాలిఅర్బన్: వక్ఫ్ చట్ట సవరణను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని తెనాలిలోని వివిధ ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శివాజీ చౌక్‌లోని జామియా మసీదు వద్ద బుధవారం సాయంత్రం ముస్లింలు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టాన్ని మొదటి నుంచి దేశంలోని ముస్లింలందరూ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అయిన కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల మనోభావాలకు విలువ ఇవ్వకుండా చట్టసవరణ చేస్తుందని ఆరోపించారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వాములైన అన్ని రాజకీయ పార్టీలు బిల్లుపై తమ నిర్ణయాన్ని మార్చుకోని ముస్లిం మైనార్టీలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

రహదారులే ఆటో పార్కింగ్ స్థలాలు!

కానరాని ట్రాఫిక్ రూల్స్!



కొత్తవంతెన, మార్కెట్ వంతెనల మధ్య రహదారిపై నిలిపి ఉన్న ఆటోలు

తెనాలిరూరల్: పట్టణ నడిబొడ్డు మీదుగా వెళ్లే రాష్ట్ర రహదారులు ఆటోలకు పార్కింగ్ స్థలాలుగా మారాయి. తెనాలి నుంచి చందోలు వెళ్లే రహదారి పట్టణ పరిధిలో కొంత మేర ఇరుకుగానే ఉంటుందని చెప్పాలి. గతంలో జరిగిన కాల్వల రీటైనింగ్ వాల్స్ నిర్మాణంలో నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యమూ ఇందుకు ఒక కారణం. ఇలా ఇరుకుగా ఉన్న రహదారి పాసింజర్ ఆటోలకు పర్కింగ్ స్థలాగా మారాయి. పశ్చిమ డెల్టాలో ప్రధాన పట్టణమైన తెనాలికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు ప్రనిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇందుకోసం హెచ్చు శాతం ఆటోలను ఆశ్రయిస్తుంటారు.

సుమారు ఆరు వేల వరకు తెనాలి ప్రాంతంలో ఆటోలు ఉంటాయని అధికారుల అంచనా. ప్రయాణికుల కోసం ఆటోలను తెనాలి-చందోలు రహదారిపై కొత్తవంతెన, మార్కెట్ వంతెనల మధ్య, బస్టాండ్ వంతెన వద్ద, మార్కెట్ వంతెన ఆంజనేయస్వామి గుడి వద్ద రహదారిపై నిలిపి ఉంచుతున్నారు.

కొత్తవంతెన, మార్కెట్ వంతెనల మధ్య ఉన్న బస్ స్టాప్ ముందు ఆటోలు ఉంటుండడంతో అక్కడ రోడ్డు వెంబడి ఆగాల్సిన ఆర్టీసీ బస్సులు రోడ్డుపై ఆపాల్సి వస్తుండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పట్టణంలో అసలే ఇరుకు రహదారి దానికి ఓ వైపు ఆటోలు నిలిపి ఉండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న సందర్భాలెన్నో. నిబంధనల ప్రకారం రహదారులపై ఆటోలను నిలపకూడదు. ట్రాఫిక్ సమస్యతో అల్లాడే తెనాలి పట్టణంలో అధికారులకు ఇటువంటి నిబంధనలు కనబడవు.



బస్టాండ్ వంతెన వద్ద నిలిపి ఉన్న ఆటోలు

రోడ్లపై ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిజాంపట్నం-పడమర కాల్వల మధ్య కట్టలో కబేళా వంతెన వద్ద గత టీడీపీ హయాంలో పిగ్ ఫాం పెట్టలని నిర్ణయించారు. అదే ప్రదేశాన్ని, దానితో పాటు ఇదే కట్టలో లోయర్ వార్ఫ్ వరకు ఉన్న ఖాళీ స్థలాలను, బస్టాండ్ నుంచి వీఎస్సార్ కళాశాల వరకు వెళ్లే తూర్పు కాల్వ కట్ట రోడ్లను ఆటోలు నిలిపేందుకు అభివృద్ధి చేసి టోకెన్ విధానాన్ని అమలు చేస్తే ఆటోల వలన రాష్ట్ర రహదారిలో ఇబ్బందులు ఉండవని ప్రజలు సూచిస్తున్నారు. అధికారులు పాలకులు ఈ విధంగా చర్యలు తీసుకుని అటు ఆటో డ్రైవర్లకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుణమేళాకు దరఖాస్తుదారుల వెల్లువ

- 835 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు
- తొలిరోజు 300 మంది రాక
- 128 మంది అభ్యర్థులు ఎంపిక



ధృవపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి టౌన్: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ కార్పొరేషన్ రుణమేళాకు దరఖాస్తుదారులు వెల్లువెత్తారు. మండల పరిధిలో బీసీ, ఓసి కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ధృవపత్రాల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. తొమ్మిది బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు, సిబ్బంది పాల్గొని అభ్యర్థుల సర్టిఫికెట్స్, సిబిల్ స్కోర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి అత్తోట దీప్తి మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 835 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో స్వయం ఉపాధి రుణానికి దరఖాస్తు చేసుకోగా రెండు విడతల్లో క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన చేపట్టినట్టు వివరించారు. తొలిరోజు నిర్వహించిన క్యాంపునకు 300 మంది హాజరు కాగా అందులో 128 మంది అభ్యర్థులు ఎంపికైనట్టు చెప్పారు. వివిధ కారణాల వల్ల మిగిలిన వారి దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టు తెలియజేశారు. గురువారంనాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులకు క్రెడిట్ క్యాంపు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు విధిగా ఇంటర్వ్యూకు అవసరమైన ధృవపత్రాలతో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు, వివిధ శాఖల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

లోపాలతో పుట్టిన చిన్నారులపై దృష్టిపెట్టండి

యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

తెనాలిఅర్బన్: లోపాలతో పుట్టిన చిన్నారులపై అందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శ్రీధర్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈ ప్రశాంత్‌లు సూచించారు. ప్రపంచ అటిజం డేను పురస్కరించుకుని ఎర్లి చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెనాలి జిల్లా వైద్యశాలలో వైద్యులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్టుకతో అనేక లోపాలతో చిన్నారులు జన్మిస్తుంటారన్నారు. వారందరికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డైక్ సెంటర్‌లలో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కొందరు దూరప్రాంతాలలో నివశిస్తుండటం వల్ల చెప్పిన సమయానికి వైద్యశాలకు రావటం లేదని, అలాంటి వారిని గుర్తించి వారికి చికిత్స అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే లోపాలతో జన్మించిన వారు సక్రమంగా మందులు వాడుతున్నారా లేదా అనేది కూడా పరిశీలించాలని సూచించారు. గురువారంతో శిక్షణ ముగుస్తుందని చెప్పారు. సమావేశంలో డాక్టర్ రాజన్ శుక్లా, జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణీ రత్నశ్రీ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఎనిమిది జిల్లాల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాల పిల్లల వైద్య నిపుణులు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, డీసీపీవోలు, ఎఎన్‌ఎంలు, ఆషాలు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల పందేలు



ఎడ్ల జత యజమానిని అభినందిస్తున్న మంత్రి సవిత

తెనాలిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పశుపాల పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఐదో రోజైన బుధవారం సాయంత్రం జూనియర్స్ విభాగం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 10 జతల ఎడ్లు పాల్గొనగా రాత్రి 10 వరకు పోటీలు కొనసాగాయి. అలాగే మంగళవారం రాత్రి న్యూ కేటగిరీ విభాగం పోటీలు ముగిశాయి. ఐదో రోజు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పాల్గొన్నారు.

న్యూ కేటగిరీ విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. ఈ విభాగంలోప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలోని నందిజీఎల్ఆర్ బుల్స్ యజమాని గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 5100 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ జత ప్రతినిధులకు మంత్రి బహుమతులను అందజేశారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

అలరించిన ‘శశిరేఖా పరిణయం’



‘ది లెసన్’ నాటికలో సన్నివేశం

తెనాలి: డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ జాతీయస్థాయి నాటకోత్సవాల్లో రెండోరోజైన బుధవారం రాత్రి ప్రదర్శించిన పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించింది. శ్రీసాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ, విశాఖపట్నం వారి పౌరాణిక పద్యనాటకం ‘శశిరేఖా పరిణయం’ (మాయాబజార్)ను ప్రదర్శించారు. శ్రీకృష్ణుడుగా విజయసాయి నటించగా, శశిరేఖ పాత్రలో కుమారి, అభిమన్యుగా జీఎల్.నాయుడు, ఘటోత్కచుడుగా విజయసారధి నటించారు. పాండవులు, కౌరవుల సంవాదం, మాయాబజారును సృష్టించి కౌరవులను ఆహ్వానించటం, అభిమన్యు, శశిరేఖల పరిణయం, ఇందుకు ఘటోత్కచుడు పన్నిన మాయా వ్యూహాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. విద్వాన్ కన్వశ్రీ రచించిన నాటకాన్ని బీవీఏ నాయుడు దర్శకత్వంలో ప్రదర్శించారు. పౌరాణికపద్యనాటకానికి ముందుగా డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్, తెనాలి వారి ‘ది లెసన్’ సాంఘిక నాటికను ప్రదర్శించారు. అతి గారాబంగా పెరిగిన కొడుకు దుర్వ్యసనాలకు లోనై తాగుడుకు డబ్బివ్వలేదని కన్నతల్లినే కడతేరుస్తాడు. ఈ నేరానికి గాను కొడుక్కి ఉరిశిక్ష పడుతుంది. మంచితనం, మానవత్వం అనే పాఠాలను పూర్తిగా చదువుకుని, ఇతరులకు అందించమని సందేశమే ‘ది లెసన్’ నాటిక సారాంశం. నటీనటులు పాత్రోచితంగా నటించారు. ప్రధాన పాత్రల్లో పీఎస్సార్ బ్రహ్మాచార్యులు, బి.మోహనరావు, ఎస్.రమేష్, జి.వసంతయామిని నటించారు. స్నిగ్ధ రచించిన ఈ నాటికను పీఎస్సార్ బ్రహ్మాచార్యులు దర్శకత్వంలో ప్రదర్శించారు. సంగీతం కేవీ రమణ, ఆహార్యం పి.శేషగిరిరావు, రంగాలంకరణ పి.వెంకటరావు. తొలుత ప్రముఖ న్యాయవాది వెలినేని రాఘవయ్య జ్యోతిప్రజ్వలన చేశారు. కళాపరిషత్ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు పర్యవేక్షించారు.

90 శాతం ఆస్తి పన్ను వసూలు

తెనాలిఅర్బన్: పట్టణ పురపాలక సంఘ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులో 90 శాతం వసూలు చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ బుధవారం తెలిపారు. తెనాలి పట్టణ పరిధిలో రూ.18,33,34,202 వసూలు చేయాల్సి ఉండగా రూ.16,46,99,960 వసూలు చేశామన్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈఏడాది రూ.2,31,96,282 ఆస్తి పన్నులు ఎక్కువ వసూలు చేశామన్నారు. కమిషర్ బండి శేషన్న సూచనల మేరకు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ప్రజల సహకారంతో ఇంత పెద్ద మొత్తంలో వసూలు చేయగలిగామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

తెనాలి టౌన్: ఎక్కడి వ్యర్థాలు అక్కడే అన్న శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. పట్టణ బుర్రిపాలెం రోడ్డు, యడ్లపాటి వెంకట్రావు బజారు కాల్వల్లో తీసిన వ్యర్థాలను గుట్టగా ఇళ్ల ముంగిట పోశారు. రోజులు గడిచినా వ్యర్థాలను తొలగించక పోవడంతో ఆప్రాంతం దుర్గంధం వెదజల్లుతుంది. స్థానికుల సమాచారంతో ఆ వార్తను ప్రచురించగా శానిటేషన్ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. అదే విధంగా ఉప్పుబజారు చివర వహాబ్‌రోడ్డులో మురుగు కాల్వ పొంగి రోడ్డు పై పారుతోంది. దీనివల్ల వచ్చే దుర్గంధం భరించలేకున్నామని స్థానికులిచ్చిన సమాచారంతో రోడ్డుపై పారుతున్న మురుగు శీర్షికన సోమవారం కథనం ప్రచురించగా పారిశుద్ధ్య అధికారులు స్పందించి కాల్వ మరమ్మతు చేపట్టారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

నాదెండ్ల: రుణాలు పొందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పాకాల ఝాన్సీరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపికైన ఎన్యుమరేటర్లకు నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు అప్పులు, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఎంపికైన ఎన్యుమరేటర్లు గ్రామ స్థాయిలో డోర్ టు డోర్ క్యాంపు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో డీపీఎం హనుమానాయక్, ఏపీఎం రమేష్, సీసీలు సాంబశివరావు, హేమలత, సుధ పాల్గొన్నారు.

తెనాలిలో ప్రారంభమైన తైక్వాండో పోటీలు



తెనాలిఅర్బన్: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తెనాలి ఇండోర్ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను పట్టణ ప్రముఖులు ఈదర వెంకటపూర్ణచంద్, వీరవల్లి మురళీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలిలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. అందరు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ 13 జిల్లాలకు చెందిన 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. గురువారం వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. గెలుపొందిన వారు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, కోచ్ కె.రోహిత్, కె.నాగభూషణం, ముప్పవరపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నాటక కళనే ‘దీపాల’ శ్వాసించారు

సంతాప సభలో సినీమాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా



దీపాల సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద కళాకారుల నివాళి

తెనాలి: కళాకారులు, సాంకేతిక నిపుణులతో కలిసి సొంతంగా నాటకసమాజం నిర్వహించిన కళాకారుడు దీపాల సుబ్రహ్మణ్యం నాటక కళలో తెనాలి కీర్తిని ఇనుమడింపజేశారని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. ఇటీవల నాటక ప్రదర్శనలో హార్మోనియం వాయిస్తూ కుప్పకూలిపోయి మృతిచెందిన పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు, కళాకారుల సంఘ కోశాధికారి శ్రీవిజయలక్ష్మీ శ్రీనివాస నాట్యమండలి పేరుతో నాటక సమాజం వ్యవస్థాపకుడు దీపాల సుబ్రహ్మణ్యం సంతాప సభను బుధవారం పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో జరిపారు. సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి అధ్యక్షత వహించారు. డాక్టర్ సాయిమాధవ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, జీవించిన ప్రతి మనిషి ఏదోకరోజు మరణించక తప్పదన్నారు. బతికిన న్నాళ్లూ సమాజంకోసం తోటిమనుషుల కోసం బతికినవారు జనం హృదయాల్లో చిరంజీవులుగా ఉంటారని చెప్పారు. నాటకరంగ ఉద్ధరణ కోసం కళారంగంలో కొనసాగుతూ తోటి కళాకారులకు జీవనోపాధిని చూపుతూ నంది నాటకోత్సవాల్లో తెనాలికి తొలి నందిని తీసుకొచ్చిన సుబ్రహ్మణ్యం ఆ కోవకు చెందుతారన్నారు. ఆయన నడిచిన బాటలో కళారంగ సేవలో కొనసాగటమే ఆయనకిచ్చే నివాళిగా చెప్పారు. కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ దీపాల సుబ్రహ్మణ్యం వ్యక్తిత్వం, గుణగణాలను వెల్లడించారు. సంఘ కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ మాట్లాడుతూ దీపాల సుబ్రహ్మణ్యం హార్మోనిస్టుగా చేసిన కృషిని, ప్రత్యేకతను తెలియజేశారు. కోశాధికారి ఎం.రామలింగేశ్వరుడు పౌరాణిక పద్యనాటకాల్లో సుబ్రహ్మణ్యంతో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేశారు. రంగస్థల, సినీనటుడు వేమూరి విజయభాస్కర్, పాతూరి సుబ్రహ్మణ్య కవి, సంఘ సంయుక్త కార్యదర్శి కనపర్తి మధుకర్, పందిటి సుబ్బారావు, లక్ష్మీతులసి, కొండయ్య, ఆర్అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య మాట్లాడారు. తొలుత సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

పాస్టర్ మృతిపై నిజాలు బయటకు తీయాలి

తెనాలిలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న పాస్టర్‌లు, క్రైస్తవులు

తెనాలిఅర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా బుధవారం తెనాలి పట్టణంలో పాస్టర్‌లు, క్రైస్తవులు, మహిళలు పెద్దసంఖ్యలో కదం తొక్కారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో ప్రదర్శన చేపట్టారు. పాస్టర్ ప్రవీణ్ మృతిలోని మిస్టరీని చేధించి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. హైద్రాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసగా తెనాలి టౌన్ పాస్టర్స్, మండల పాస్టర్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఓవర్ బ్రిడ్జి, ఆషా థియేటర్ రోడ్డు మీదుగా సాయిబాబా గుడి వద్దకు చేరుకుంది.

అక్కడి నుంచి ప్రకాశం రోడ్డు, రజక చెరువు, గాంధీ చౌక్, బోసురోడ్డుల మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకుంది. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందారని గుర్తు చేశారు. పాస్టర్ ప్రవీణ్ మృతికి కారణాలు వెంటనే తెలియజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తెనాలి టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ కూచిపూడి అబ్రహం, తెనాలి మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ ఎ.భానుప్రసాద్, నాయకులు బిషప్ కత్తెర సుధీర్ కుమార్, బిషప్ జె.ప్రభుదాసు, బిషప్ పినపాటి జాన్‌పాల్, బిషప్ పాముల పరంజ్యోతి, పల్లె సామ్యూల్, బ్రదర్ సాల్మన్, బ్రదర్ రావూరి విక్టర్ పాల్, రెవరెండ్ మార్టిన్ లూథర్ బాబు, బ్రదర్ ఆనందన్న, బ్రదర్ రెడ్డిబోయిన అబ్రహం, రెవరెండ్ మార్పు స్టీఫెన్, పాస్టర్‌లు మల్లవరపు విజయ్ కుమార్, పినపాటి గంగారావు, డి యేసురత్నం, వై లెనిన్ బాబు, తెనాలి డేవిడ్, సర్వోన్నతరావు, సువర్ణరాజు, డీసీ థామస్, నందివెలుగు రమేష్, పినపాటి స్టీవెన్ బాబు, కారుమూరి జక్రయ్య, ఎం ప్రభుదాస్, కఠెవరపు జాన్‌బాబు, క్రైస్తవులు కఠెవరపు దేవానంద్, అక్కిదాసు కిరణ్ కుమార్, మట్లపూడి రాజేశ్వరరావు, పినపాటి సురేష్ బాబు, తమనం భూషణం, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన డొంక రోడ్డు సమస్య



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్లు గోపాలకృష్ణ, సునీత



ఖాజీపేటలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రైతులతో చర్చించిన తహసీల్దార్లు

తెనాలిరూరల్: రైతులు ఉపయోగించే డొంక మార్గంలో అవాంతరాలను తొలగించేందుకు బుధవారం తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, దుగ్గిరాల తహసీల్దార్ ఐ. సునీత రైతులతో బుధవారం చర్చించారు. విజయవాడ చెన్నై రైలు మార్గంలో మూడవ రైల్వే లైన్ ఏర్పాటుతో దుగ్గిరాల-కొలకలూరు మధ్య తరచుగా రైతులు ఉపయోగించే డొంకకు అవాంతరం ఏర్పడింది. దీనికి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ రికార్డుల ప్రకారం పాత డొంక మార్గాన్ని రైతులకు చూపించారు. అయితే ఈ మార్గంలో డొంక కొంత ఆక్రమణలకు గురైంది. కొందరు రైతులు ఆక్రమించి దీర్ఘకాలికంగా సాగుచేస్తూ ఉన్నారు. రైతులు పొలాలకు రాకపోకలు సాగించాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులను ఇంటికి చేర్చుకోవాలన్నా డొంక అనివార్యం. ఈ నేపథ్యంలో నలుగురు రైతులతో తహసీల్దార్లు చర్చించారు. దీనిపై వారు మాట్లాడుతూ డొంక సమస్య దాదాపుగా ఓ కొలిక్కి వచ్చిందని చెప్పారు. సమావేశంలో రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వ్యవసాయ బోరు వివాదంపై..

తెనాలిరూరల్: మండల గ్రామం కొలకలూరు పంచాయతీ పరిధిలోని ఖాజీపేటలో రైతుల మధ్య నెలకొన్న వ్యవసాయ బోరు వివాదంపై బుధవారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ విచారణ జరిపారు. గతంలో రైతులు ఉమ్మడిగా రెండున్నర సెంట్లు భూమిలో వ్యవసాయ బోరును ఏర్పాటు చేసుకున్నారు. దానిని ఉమ్మడిగా ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బోరుకు సంబంధించిన పైపులైను ఏర్పాటులో, దాని నీటిని ఉపయోగించుకునే విధానంలో రైతుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీనిపై వచ్చిన అర్జీ మేరకు తహసీల్దార్ రైతులను విచారించారు. అయితే వివాదం కోర్టులో కూడా నడుస్తుందని, కోర్టు తీర్పు ఈ నెల 17న రానున్న నేపథ్యంలో తీర్పు వెలువడిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు వెల్లడించారు. ఆయన వెంట వీఆర్వో కె. జార్జి థామస్, పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

తెనాలిరూరల్: లాడ్జీల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సూచించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులతో బుధవారం రాత్రి ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లాడ్జీలకు వచ్చే వారు అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఖచ్చితంగా పోలీసులకు సమాచారమివ్వాలని, గదులు అద్దెకు తీసుకునే వారి నుండి తప్పనిసరిగా ఆధార్ కార్డు/పాన్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఐడీ కార్డులను తీసుకుని సమాచారాన్ని రికార్డు చేయాలన్నారు. మైనర్లకు గదులు ఇవ్వాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా డైలీ రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండ లాడ్జిల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, బెట్టింగ్, జూదం, వ్యభిచారం నిర్వహించేవారు గదులను అద్దెకు తీసుకుని పట్టుబడితే నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.